# క్రీనీడ

పి.వి.యస్. అచ్యుతవల్లి

''ఇంత ఆలస్యం?''............ సరసిజ ముఖం లో ప్రశ్న గ్రహించాడు నరసయ్య. రాత్రి పన్నెండున్నర అయ్యింది. సాంబారులోని కారట్ ముక్క కొరుకుతూ డైనింగు బల్ల వద్ద కూర్చున్నాడు. ''రెండు అప్పడాలు కాల్చకూడదా!'' అన్నాడు అర్థింపుగా. సాంబారులో అప్పడాలు నంజుకోవటం నరసయ్యకు ఇష్టమే!

"అర్ధరాత్రి అంకమ్మ శివాలు! ఈ వూరు వచ్చినప్పట్నించి చూస్తున్నాను. రోజూ రాత్రిళ్ళు లేటు చేస్తున్నారు. కారణం ఆడవాళ్లకి అనవసరమయినదా? చెప్పలేనిదా?"

''ఛ అదేం కాదు. తాగినవాడు వున్న రిక్షా కారుకి అడ్డం వొచ్చింది. అతనిని ఇంటికి తీసుకు వెళ్ళి సురక్షితంగా వాళ్ళావిడకు అప్పచెప్పి రిక్షావాడికి వంద రూపాయిలు ఇచ్చి......"

''చేపా చేపా ఎందుకు ఎండ లేదు? గడ్డి దుబ్బు నీడ అడ్డం వచ్చింది. అనే కథ నేను చిన్నప్పుడు అయిదేళ్లప్పటి నించి వింటున్నాను.''

''నన్ననవసరంగా అపార్థం చేసుకోకు...''

"ఈ అపార్థం సీనులు నేను పధ్నాలుగేళ్ల అమ్మాయిగా వున్నప్పట్నించి సినిమాలలో చూస్తూనే వున్నాను."

''మరెలాగ నిన్ను నమ్మించటం! మనిద్దరి మధ్య వుండవలసినంత నమ్మకం వుండటం మానేస్తోందని నాకు భయంగా వుంది సరసి''.

''భయంవల్లనే అబద్ధాలు సృష్టించాలన్న యావ వస్తుంది. నిర్భయంగా సంచరించండి. ఆరోగ్యాన్ని పాడు చేసే అలవాట్ల కి బానిసలు కాకండి!''

''అల్లాగే'' అన్నాడు నరసయ్య. ధీమాగా వంటిల్లు సర్దుకుని పక్కకు చేరేసరికి ఒంటి గంట దాటింది. నరసయ్య నిద్రపోలేదు. సరసి వచ్చి మంచం అంచున కూర్చుంది. నరసయ్య దూలం కేసి చూస్తున్నాడు.

''రేపు ఒక చోటకు నువ్వు వస్తావా'' అన్నాడు.

''ఎన్ని గంటలకి ?''

''ఉదయం పది గంటలకి వెళ్దాము''

''అల్లాగే'' అంది సరసిజ.

ఎక్కడికి ఎందుకు అనే ప్రశ్నలు వేయదు సరసిజ. 'తినబోతూ రుచి అడగడం ఎందుకు? వెళ్లినాక అదే తెలుస్తుంది సంగతేమిటో' అనుకుంది సరసిజ. లడ్డు బడ్డూలని స్కూళ్లకి పంపి వేసి తను తయారయ్యింది సరసిజ. ఇద్దరూ ఆడపిల్లలే సరసిజకు. లడ్డుకు తొమ్మిదేళ్ళు. బడ్డుకి ఏడేళ్ళు వున్నాయి. తొమ్మిదింటికి కారియర్ సర్దుకుని పట్టుకుపోతే సాయంకాలం అయిదింటికే తిరిగి వస్తారు. నరసయ్య ఆఫీసుకి వెళ్లి సంతకం పెట్టి తిరిగి ఇంటికి వచ్చేడు. ఇద్దరూ అతనింటికి వెళ్లారు. భూపాల్ పెద్దకంపెనీలో బిజినెస్ మానేజర్ గా వుంటున్నాడు. నెలకు మూడు వేల రూపాయిలు పైగా జీతం వస్తుంది. నీరజ అతని భార్య! మహిళా కళాశాలలో లెక్చరర్ గా పని చేస్తూందట!

''రండి. రండి'' అంటూ ఆహ్వానించింది నీరజ. నల్లగా పొడుగ్గా వుంది ముఖంలో దీనత్వం, మనస్సులో దిగులున్నట్లుంది.

''అతను లేడా!'' అన్నాడు నరసయ్య.

''ఏదో అర్జంటు పని వుందని బయటికి వెళ్ళారు."

''ఇవ్వాళ మీకు కాలేజీలేదా!'' అంది సరసిజ.

''శలవు పెట్టాను''- కాఫీ ఫలహారం తెచ్చింది నీరజ.

''మేము వెళ్లేదాకా రాడా మీ ఆయన'' అన్నాడు నరసయ్య.

''అదేం లేదు ఫోను వచ్చింది నిజంగానే'' అంది నీరజ. కాస్సేపు నీరజ, నరసయ్య లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు. టేప్ రికార్డర్ లో బాలమురళి పాడిన అన్నమాచార్య కీర్తనలు విన్నారు. అవి సరసిజకు ఇష్టం.

''ఈ క్యాసెట్ తీసుకుంటాను మళ్లీ తెస్తాను లెండి.'' "తీసుకోండి" అంది నీరజ.

ఇంటికి వచ్చేక అడిగింది సరసిజ.

''వాళ్లెవరని అడగవచ్చా''

''నీరజ మా చిన్నాయిన కూతురు''

''అయితే నాకు ఆడపడుచన్నమాట! ఇన్నాళ్ల నాకు చెప్పలేదేం మీకు బంధువులు వున్నట్లు?"


''వాళ్లిక్కడవున్నట్లు నాకు నిన్ననే తెలిసింది. నీరజ చాలా మంచిది నెమ్మదయినది, అనవసరంగా వాడి వలలో పడింది.......''

''వాళ్ల మామూలు భార్య భర్తలు కారా''? అని నాలుక్కరుచుకుంది సరసిజ. 'అల్లా ఒకళ్లని అనగల అర్హత తనకుందా!' అని తర్కించుకుంది తనలో తనే!

''ప్రేమికులు వాళ్ళు. ప్రేమించుకుని పెళ్ళి చేసుకున్నారు'' అన్నాడు నరసయ్య మామూలుగానే.

''క్షమించండి అనాలోచితంగా అనేశాను''

''చాలా సాధారణం. ఆడవాళ్ళు అనే మాటే అది! దానికి క్షమార్పణ దేనికి! అందులో నా ముందు''-



"ఇంతకీ......"

"భూపాల్ నాలుగు సంవత్సరాల నుంచి విపరీతంగా తాగుడుకు అలవాటు పడ్డాడట. నిన్న నా కారుకి గుద్దుకుని క్రింద పడిపోయిన వాడు భూపాలే! ఇంటికి తీసుకు వెళ్ళేసరికి నీరజ భర్త అని తెలిసింది.తెలిశాక......"

"భూపాల్ మీకు ముందు తెలుసా!"

"ఇరవయి ఏళ్ల క్రితం మేమిద్దరం ఒకే కాలేజి నుంచి డిగ్రీ తీసుకున్నాం. అతని పెళ్ళికి వెళ్ళినట్లు కూడా నాకు జ్ఞాపకం బాగా!"

"పెళ్ళి కూతురు మీకు జ్ఞాపకం లేదా" అంది నవ్వి.



"బంగారం జరీపూల వెల్లతో వున్న గులాబీ రంగు చీరా, మొగలి రేకుల పూల జెడా గుర్తువున్నాయి. ఆపిల్ల ముఖం గుర్తులేదు. అసలు తలెత్తి నయగురి కేసి ఆ పిల్ల చూడలేదు. తెల్లటి పల్చని చెంప మీద పావలా కాసంత కాటుక బొట్టుకూడా గుర్తుకు వస్తోంది. అన్నట్లు వేడి వేడి బొబ్బట్లు పాలల్లో ముంచుకుని తిన్నట్లు కూడా జ్ఞాపకం" అన్నాడు నరసయ్య.

"మీ ఫ్రెండ్ మిమ్మల్ని గుర్తు పట్టలేదా రాత్రి"

"లేదు. అసలు నీరజే గుర్తు పట్లేదు. నేనే తెలియ చెప్పుకున్నాను. నిన్ను పరిచయం చేద్దామని తీసుకు వెళ్లాను. అంత తాగుబోతు ఎలా అయినాడో! నాలుగు దులుపుదామనుకున్నాను. కలవకుండా పారిపోయేడు చూడు!"

"ఒకే వూళ్లోనే వుంటున్నాం కదా! లడ్డూ పుట్టిన రోజుకి పిలుద్దాం. వచ్చినప్పుడు మీరు భూపాలుగార్కి నచ్చజెప్పండి. అయినా ఒకసారి అలవాటుకి బానిస అయినారంటే వాళ్లని ఆ అలవాటు నించి మార్చలేము. మన ప్రయత్నం మనం చేయటమే! స్నేహమే కాకుండా బంధుత్వం కూడా కలిసింది కదా!" అంది సరసిజ.

"ఈ విషయంలో నువ్వు చాలా అదృష్టవంతురాలివి సరసీ నిజంగా" అన్నాడు నరసయ్య.

"అదేమిటండీ సడన్‌గా గుర్తుకు వచ్చింది నా అదృష్టం"


"నాకు నీవు లేకుండా సినిమా చూడ బుద్ధి పుట్టదు సిగరెట్టు ముట్టుకుందుకు కూడా అసహ్యం...."

"కాఫీయేనా రెండో కప్పు తాగరు. సెల్ఫ్‌టైర్ ఎందుకండీ– నేను మిమ్మల్ని మెచ్చుకోవటం లేదా చెప్పండి! మా వారు శ్రీవారు మా మంచివారు అంటాను." "అయినా కొంచెం రాత్రి లేటయిందంటే నీకు నా మీద..."

"అనుమానం అంటారా! అనుమానం కాదండి ఆరాటం! నాక్కావలసిన మనిషి నన్ను రక్షించవలసిన మనిషి అర్ధరాత్రి అపరాత్రి తిండీ తిప్పలు మానుకుని ఎవళ్ళకు సహాయపడుతున్నారో కదా అనే ఆరాటం. వేళకు తిండి, నిద్ర అమరకపోతే అనారోగ్యాలపాలు అవుతారు అనే భయం మన పిల్లలు చిన్నవాళ్లు. అందులోనూ ఆడపిల్లలు..."



"మరీ పని ఎక్కువ అయితే తప్ప సాధారణంగా నాకు బయట తిరగటం ఇష్టం వుండదు అని నీకుతెలీదా? చల్లని ఇల్లాలూ, చక్కని పిల్లలు, ఆర్థిక బాధలు లేని ఇల్లు. ఇంతకంటె మగవాడికి తృప్తినిచ్చే జీవితం వేరే వుందా? మనం సంపాదించుకుంటున్న దానిలో కొంచెం పిల్లల



# స్వాతంత్ర్య ఫలాలు

స్వాతంత్ర్య ఫలాలు తెస్తానని
అతను వెళ్ళాడు
వెళ్ళేముందు అన్నాడు
"నేను తిరిగి వచ్చేస్తాను
అందాకా వేచి ఉండండి".
సేతువు రాజ్యమేలే
ఏకాంత కాంతారానికే వెళ్ళాడో
నీలి రంగు పులుముకున్న
పర్వత శిఖరాన్ని
అధిరోహించడానికే వెళ్ళాడో
నాకు తెలియదు.
ఆ సుదీర్ఘ ప్రయాణంలో
ఎన్ని అడ్డంకుల్ని అధిగమించాలో
ఎన్ని విపత్తుల్ని తప్పుకొని సాగాలో
నాకు అంతు పట్టదు.
నాకు తెలిసిందల్లా ఒకే ఒక్క విషయం:
స్వాతంత్ర్య ఫలాలకోసం అతను వెళ్ళాడని
తను తిరిగి వచ్చేవరకూ నన్ను వేచి ఉండమన్నాడని.
ఒక పుష్కరకాలం
అతనికోసం ఓపికతో నిరీక్షిస్తాను
అప్పటికీ అతను రాకపోతే
నా అంతట నేనే బయలు దేరుతాను
నేనూ తిరిగి రానూ
నా మార్గంలోనే నా పిల్లలూ
బయలు దేరుతారు

మూలం: శ్రీ సునీల్ గంగోపాధ్యాయ్    అనుసరణ: 'జానకీజాని'

భవిష్యత్తుకి దాచి మిగిలినది మన కోసమే మనం ఖర్చు పెట్టుకుంటూ సంసారం ఒడిదుడుకులకు లోను గాకుండా నిర్వహించుకోగలగటం మగవాడి బాధ్యత" అన్నాడు నరసయ్య.

"నిజమే! నా అదృష్టం కొద్దీ నాకు ఆనంద మార్గం చూపించింది. ఈ జీవితం ఆమె పెట్టిన భిక్ష!"

"ఏమిటి సరసీ! ఇప్పుడావిడ గుర్తుకు వచ్చింది!"

"రెండు రోజులు ఆగండి, మీకు మంచి కథ చెప్తాను"అంది సరసిజ.

అనుకున్నట్లుగానే లక్ష్మి పుట్టిన రోజున భూపాల్ దంపతులను భోజనానికి పిలిచారు. తెల్లగా బొద్దుగా వున్న లక్ష్మిని చూసి చాల మురిసి పోయింది నీరజ. భూపాల్, నరసయ్య చిన్నప్పటి కబుర్లలో మునిగి పోయేరు.

"అన్నయ్య పెళ్లి అయినట్లే తెలీదు నాకు. ఎక్కడి వాళ్ళం ఎల్లా కలిశాం" అంది నీరజ. భోజనాలయినాక తీరిగ్గా తాంబూలాలు నములుతూ సోఫాలో కూర్చున్నారు స్త్రీలిద్దరూనూ.

"మాది మామూలు పెళ్లి కాదు. బంధువులు. బాజాబజంత్రీలు లేని పెళ్లి" అంది సరసిజ నవ్వుతూనే.


"మీరు కూడా..." అంది నీరజ.

"ప్రేమించలేదు నేను. అసలు నాకు ప్రేమించటం చేతకాదు కూడా!"

"అయితే..."

నరసయ్య, భూపాల్ కబుర్లు ఆగిపోయేయి. వాళ్లిద్దరి చెవులూ తమాషాగా సరసిజ చెప్పే కథ కోసం నిలబడిపోయేయి.

"నాకు పదహారేళ్లప్పుడు అన్నయ్యలు పెళ్లి సంబంధం కుదిర్చేరు. పాతిక వేల రూపాయిలు కట్నం. ఆయన తండ్రికి ఒక్కగాని ఒక్క కొడుకట! పెద్ద పెద్ద కంపెనీలలో వాళ్లకు షేర్లున్నాయట. ఏవో చాలా చాలా ఆర్భాటంగా చెప్పుకున్నారు అన్నా వదినలు. సరే పెళ్లయింది. కాపరానికి వెళ్లాను. ఇంట్లో పనేం వుండదు నాకు. ఆయన గదిలో అస్తమానూ కంపెనీ పుస్తకాలు చదువుతూ వ్రాసుకుంటూ కూర్చునేవారు. నాకు అక్కడికి వెళ్లి ఆయనతో కబుర్లు చెప్పాలని అనిపించేది.




"లోపలికి వెళ్లు లోపలికి వెళ్లు" అనేవారు. ఎవరో అమ్మాయి వచ్చేది. ఆయన ఈజీఛైర్‌లో కూర్చుని విలాసంగా సిగరెట్టు త్రాగుతుంటే ఆ అమ్మాయి పెద్ద బారు జడ భుజం మీదించి ముందుకు వేసుకుని చిన్న స్టూలు ఆయన కుర్చీ ప్రక్కన వేసుకుని కూర్చునేది. ఏవేవో కబుర్లు దొర్లిపోయేవి వాళ్ల మధ్య గంటలకి గంటలు. రోజులకి రోజులు కూర్చున్నా వాళ్లకి తనివి తీరేది కాదు అనుకుంటాను. రెండు మూడు నెలలు ఓపిక పట్టాను. ఒకరోజు ఆయన్ని అడిగాను-కోపంగానే అడిగాను. నాకు నిజంగానే ఉడుకుమోత్తనం వచ్చింది.

'ఆమె ఎవరు?' అన్నాను.

'నాకు కావల్సిన వ్యక్తి' అన్నారు.

'నేనెవర్ని' అన్నాను.

మాట్లాడలేదు.

'భార్యతో మాట్లాడటానికి మాటలు రావు. ఒక బజారు మనిషితో గంటలకు గంటలు డబ్బాలు కొడుతూ ఎల్లా కాలం గడుపుతున్నారు. నాకింట్లో తోచదు. ఏం చేయను' అన్నాను. మర్నాడు మా అన్నయ్యలని పిలిపించి నన్ను అప్పగించేశారు. మా అన్నయ్యలతో నేను మర్యాద తెలియని మనిషిని అని చెప్పారట. ఇంటికి వచ్చేక మా అన్నయ్యలు చాల బాధ పడ్డారు. వదినలు, అన్నయ్యలు చాలా ప్రేమగా చూసే వారు. అయినా నేను ఎన్నో సార్లు మళ్లీ వాళ్లింటికి వెళ్లాను. ఇంకెప్పుడూ మిమ్మల్ని నిలదీసి ఏమీ అడగనని చెప్పాను. అయినా ఆయన నన్ను వాళ్లింట్లో ఉండనివ్వ లేదు. మా అన్నయ్యల కు కోపం వచ్చింది. నిన్ను బాధ పెట్టినందుకు వాడి జీవితం నాశనం అవ్వాల్సిందే అన్నారు. కాని నాకే గమ్మత్తుగా ఆయనంటే కోపం పోయింది. మళ్లీ కాలేజీలో జేరాను. డిగ్రీ తీసుకున్నాను. అప్పుడే ఆనందతో పరిచయం అయింది. నేనంటే చాలా జాలి ఆమెకి.'బియ్యే పాసయినావు. తర్వాత' అంది ఆనంద.

'యం.ఎ చేస్తాను' అన్నాను. నిజంగానే చదువే నా గమ్యం అప్పుడు.

"ఆ తర్వాత!

'చదవగలిగితే-పరిశ్రమించగలిగితే పి.హెచ్.డి.'

'ఆ తర్వాత!'

'తర్వాత...' ఆగిపోయేను. తర్వాత ఏం చేయాలి.

'చూసావా సరసీ! ఎంత చేసినా ఎక్కడో ఒక చోట మనం నిలబడిపోవాల్సి వుంటుంది. అందుకే నేను ఒక సలహా ఇవ్వదలిచాను నీకు'

'ఏమిటి'

'మళ్ళీ పెళ్లి చేసుకో!'

'నాకా పెళ్లా' అన్నాను. ఎందుకో ఏడుపు వచ్చింది. ఏడిచేసాను బాగా!

'శుభమా అని కన్నీరేమిటే పిచ్చి!' లాలించింది.

'మరేం చేయను!'

'నేను మీ అన్నయ్యలతో చెబుతాను నీకెందుకు.' అంది. తర్వాత ఆనంద అన్నయ్యలని పిలిపించి ఆ మనిషితో విడాకులు చట్ట ప్రకారం ఇప్పించింది.

అన్నయ్యలు ముందు వంశ గౌరవం, పరువు ప్రతిష్ట

అంటూ బాధ పడ్డారు. వదినలు కూడా మళ్లీ పెళ్లి ఏమిటి ఎందుకు అని చీదరించేరు. గౌరవం పరువు కన్నా జీవితాలకి విలువ ఇయ్యండి. సరసికి అతనితో పంచుకున్న మధురానుభూతులేమీ లేవు. మీరు ఆస్తులు ఇస్తారు. విద్య ఆమెకి కాలక్షేపం, విజ్ఞానాన్ని కలిగించుతుంది. కాని గడిచిపోయిన కాలం ఆమెకి జీవితాన్ని మిగల్చదు. కూడూ, గుడ్డా నీడా కోసమే ఇంతమందీ పెళ్లిళ్లా చేసుకుంటున్నారనుకోవటం అవివేకం. కష్టసుఖాలలో మన అని అర్థం చేసుకునే తోడు వుండాలి. ఇది మనసొత్తు అనే ఆప్యాయత అనురాగం వుండాలి . దురదృష్టం కొద్దీ మీరు మెచ్చి తెచ్చిన సంబంధం కలిసి రాలేదు. ఈ సారి ప్రయత్నించి చూడండి' అని అన్నయ్యలకి నచ్చ చెప్పింది. అన్నయ్యలు పేపరులో నాగురించి పెళ్ళి ప్రకటన వేసారు. ఆశ్చర్యంగా చాలా మంది అప్లికేషన్లు పంపారు. ఆనంద నా ప్రక్కన నిలబడింది. అందర్నీ ఆమే ఇంటర్వ్యూ చేసింది. అల్లా మీ అన్నయ్య నా భర్తఅయినారు. రోజూ ఆనందని తల్చుకుంటూ వుంటాను. నాకు తెలియని, స్ఫురణకు రాని జీవిత గమ్యం ఆమే నిర్దేశించ కలిగింది.'' నీరజ నిశ్శబ్దంగా వుండిపోయింది. నరసయ్య, భూపాల్‌లు కూడా నిశ్శబ్దంగా వుండిపోయేరు. హాలులో చివర అద్దు, బద్దు చాలా దీక్షగా కామిక్‌ను చదవటంలో మునిగి వున్నారు.

''ఏమిటి ఆశ్చర్యంగా వుండిపోయారు'' అంది గలగల నవ్వుతూ సరసిజ.

''ఏం లేదు'' అంది పొడిగా నీరజ. ఆమె కళ్లు తడి అయ్యాయి మరి!

''కాఫీ కలుపుకు వస్తాను, ఈ ఆల్బం చూస్తూ వుండండి'' అంటూ బీరువాలోంచి ఆల్బం తీసి ఇచ్చి వంటింటి వైపు వెళ్లింది సరసిజ. సరసిజ చిన్నప్పటి ఫోటోలు చాలా వున్నాయి. అందులో చిన్నప్పుడు జరీపూల చెట్లు న్న చీరలో బుగ్గన కాటుక చుక్కతో పెద్దపూల జెడతో గౌరీ దేవి పూజ చేస్తూన్న సరసిజ చాలా ముచ్చటగా వుంది. కాఫీ కలిపి ట్రేలో పెట్టుకుని వచ్చింది. తన ఫోటో ❧ డి కళ్ళతో చూస్తున్న నీరజని గమనించింది.

" ఆ ఫోటో నాకు చాలా ఇష్టం. ఆ అలంకరణ కూడా చాలా ఇష్టం. అందుకనే ఆ ఫోటో నా ఆల్బంలో చోటు చేసుకుంది" అంది సరసిజ.

''చిన్నప్పటి స్మృతి అది. చాలా బాగుంది'' అంది నీరజ.

''చిన్నప్పుడు చాలా త్రికరణ శుద్ధిగా గౌరీదేవి పూజ చేసి వుంటాను. అందుకే అనుకూలుడయిన భర్త దొరికారు'' అంది సరసిజ. నీరజ సన్నగా నవ్వింది.

'నేను పూజలు ఏమీ చేయలేదు. ముహూర్తాలు అసలే చూడలేదు. అందుకనే నా భర్త తాగుడికి బానిస అయివుంటాడు. నన్ను ప్రేమించాడు అని భ్రమ పడ్డాను కాని అతను మనుష్యుల్ని కన్నా ముందు బాటిల్నే ఎక్కువ ప్రేమించుతాడు' అనుకుని

భూపాల్‌కి చెప్పాడు నరసయ్య.

''నువ్వు అతిగా తాగుతున్నావు. నీవూ చెల్లాయీ కూడా గౌరవనీయమయిన వృత్తుల్లో వున్నారు. ఈ వ్యసనంతో నిన్ను నీవు దిగజార్చుకుంటున్నావు. నీకంత కష్టం ఏముంది. తాగుడుతో నిన్ను నీవు మర్చిపోవా లన్నంత వ్యధ నీకు ఏముంది'' అన్నాడు నరసయ్య.

''సన్నిహితుల హితోక్తులతో నేను మారిపోగలిగితే ఈ పాటికే మారిపోయి వుందును. మానవుడు అలవాటుకి బానిస! మీ చెల్లెలితో కబుర్లు చెప్పి చెప్పి ఆ అలవాటుని వదుల్చుకోలేక వివాహాన్ని కూడా రద్దు చేసుకున్నాను. అల్లాగే తాగుడుని వదుల్చుకోలేక మీ చెల్లెల్ని హింసించుతున్నానేమో! అయినా నీరజ ఎప్పుడూ' మీరు తాగకండి' అని నన్ను ప్రాధేయపడ లేదు. మామూలు భార్యలా'' అన్నాడు భూపాల్ నవ్వుతూనే .

"చెల్లెమ్మా! నీదే ఆలస్యం! నువ్వు బతిమిలాడితే ఈయనగారు తాగుడ్ని వదిలేస్తారట" అన్నాడు నరసయ్య.

''అయితే రోజూ బతిమలాడుతాను. దానికేం'' అంది నీరజ.

వాళ్ళు వెళ్లిపోయేక సరసిజ అంది –

''నిజంగానే నా అంత అదృష్టవంతురాలు ఇంకెవ్వరూ లేరు అనుకుంటున్నానుస్మండీ!"

''ఎంచేత''

"చల్లగా చూచే భర్త. చక్కని పిల్లలూ, ఆర్థిక బాధలు లేని సంసారం......"

''నా మాట నాకే అప్పగించుతున్నావు"

''లేదు. అప్పగించటం కాదు. మనస్ఫూర్తిగా అంటున్నాను. నాలాంటి ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసుకుంటూనో, లేకపోతే పుట్టిళ్ళలోనూ, బంధువుల ఇళ్ళలోనూ లక్ష అనుమానాలతో, కోటి అపవాదులతో తల దాచుకుని రోజులు గడుపుకువస్తారు. ఇంతకీ భూపాల్ భార్య మీకు గుర్తు లేదా?''

''చెప్పానుగా! జరీ పూలచెట్ల చీర, మొగలి పూల జెడా చెంపన చుక్క, తెల్లగా బొద్దుగా..." ఆల్బంలో తన పెళ్ళినాటి గౌరీ పూజ ఫోటో చూపించింది.

''నిజంగా నువ్వేనా సరసూ! నా కళ్ళు నన్ను మోసం చేస్తున్నాయా!''

''నీరజ గుర్తు పట్టారు''

''మరి అతను!''

''గుర్తుంచుకునేటంత సాన్నిహిత్యం మా మధ్య వుండేది కాదు!'

''సరసీ! నీకు ఆనాటి పెళ్ళి వేడుకలు, హడావిడి, బంధువులతో సరదాగా గడిపిన అనుభూతి జ్ఞప్తికి వస్తే...''

''ఆగండి. నాకు అదంతా మర్చిపోవటమే బాగుంటుంది. గాయం మానినా మచ్చ మిగిలినట్లుగా వుంటుంది. ఎవరింటికి పెళ్ళికి వెళ్ళినా ఆ నవ వధూవరులను చూస్తూ 'భగవంతుడా........ వీళ్ళ జీవితాలలో క్రీనీడలు పడకుండా వరమియ్యి!' అని మనస్సులోనే వెయ్యి నమస్కారాలు చేస్తాను!'

''అవును సరసూ! జీవితంమీద క్రీనీడలు పడక మానవు. అది గమనించి వెలుగులోకి రాగలడటమే జీవన ధ్యేయం కావాలి. ఇవి అన్ని చాల చిన్న విషయాలు. మన సుఖ సంసార జీవితానికి అనవసరమయినవి.'' అన్నాడు నరసయ్య.

తృప్తిగా నవ్వింది సరసిజ నిండు చామంతిలా. 'ఒకవేళ భూపాల్-నీరజ, చాలా తృప్తిగా, సంతోషంగా జీవితం అనుభవిస్తుంటే సరసిజ ఇంత హాయిగా వుండ గలిగేదా?' అని అనుకున్నాడు నరసయ్య. 'అయినా ఆమె ఒక పీడకలలాంటి గతాన్ని తనవల్ల మర్చిపోయింది. మళ్లీ నిశ్చలకాసారం లాంటి తన సంసారంలో ఎలాంటి దుఃఖపు నీడలూ పడనీయకూడదు. అది తన చేతుల లోనే వుంది' అని దృఢంగా నమ్మేడు నరసయ్య.

